

24న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం ఐటీడీఏలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవంతి ఫీడ్స్, అరబిందో ఫార్మా, జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. కనీస విద్యార్హత ఏమీ లేకపోయినా పర్వాలేదన్నారు. 18-35 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులన్నారు. మరికొన్ని ఉద్యోగాలకు టెన్త్ ఉత్తీర్ణత తప్పనిసరి అని వెల్లడించారు. కాగా నాలుగు వందల అప్రంటీస్ పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కోట్లు వెచ్చించినా.. నెరవేరని లక్ష్యం

- వంశధార వరద మళ్లింపునకు కాలువ నిర్మాణం చేపట్టినా.. ప్రయోజనం శూన్యం
- పంట భూములకు చేరని సాగునీరు
- కాట్రగడ్డ వద్ద ఇసుక మేటలు
- రైతులకు తప్పని ఇక్కట్లు

భామిని: గత ప్రభుత్వాల నిర్లక్ష్యం.. అధికారులు, ప్రజాప్రతినిధుల ఉదాసీనత వైఖరి కారణంగా వంశధార వదరనీరు మళ్లింపు లక్ష్యం నీరుగారింది. కోట్లాది రుపాయల ప్రజాధనం వృథా అయ్యింది. వరద కాలువ పనులు చేపట్టినా.. ఆశించిన స్థాయిలో నీరు రాని పరిస్థితి. దీంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ఏటా రైతులు వరుణుడిపైనే ఆధారపడాల్సి వస్తోంది. చివరకు కాట్రగడ వరద కాలువ వద్ద ప్రాంతం ఇసుక ర్యాంప్‌గా మారడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కాట్రగడ వరద కాలువ ముఖద్వారం వద్ద ఇసుక మేటలు

ఇదీ పరిస్థితి..

భామిని మండలం కాట్రగడ్డ ఓపెన్ హెడ్ చానల్ నుంచి శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో వంశధార జలాశ యానికి వరదనీరు మళ్లించాలని అప్పట్లో భావించారు. సుమారు రూ.వెయ్యి కోట్లతో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ఒడిశాతో ఉన్న వివాదాల కారణంగా ఎర్త్ వర్క్ మాత్రమే పూర్తయ్యింది. ఆ తర్వాత 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనుల్లో కదలిక వచ్చింది. ఈ మేరకు 33 కిలోమీటర్ల మేర వరద కాలువ నిర్మాణం పూర్తి చేశారు. 2017లో కాట్రగడ నుంచి వరదనీటిని హిరమండలంలో వంశధార రిజర్వాయర్‌కు మళ్లించారు. కాగా 2019 తర్వాత సీన్ మారింది. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గేట్లు, పిల్ల కాలువ పనులను పూర్తి చేయలేకపోయింది. కాట్రగడ ఓపెన్‌హెడ్ చానెల్ వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. వైసీపీ ప్రజాప్రతినిధులు సైతం ఈ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మరోవైపు నదిలోకి పది వేల క్యూసెక్కులు దాటి వరద రాకపోవడంతో శ్రీకాకుళం జిల్లాలో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరందడం లేదు. సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయికపోవడంతో భామిని మండలంలోనూ 2వేల ఎకరాలకు నీరందడం లేదు. దీంతో ఏటా రైతులకు సాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు.

- ఇటీవల కాలంలో కాట్రగడ్డ వరదకాలువ ముఖద్వారం వద్ద పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేశాయి. అయితే వేసవిలో వాటిని తొలగించాల్సిన వంశధార ఇంజనీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. సకాలంలో ఆ పనులు పూర్తి చేసి ఉంటే వంశధార వరద కాలువ గుండా నీరు ప్రవహించేది. వరదలు వచ్చే సమయంలో వ్యవ సాయ భూములకు నీరొచ్చేది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.



పూర్తి కాని కాలువ లైనింగ్ పనులు

పూర్తిస్థాయిలో రాని వరద...

గత రెండేళ్లుగా వంశధార జలాశయానికి ఆశించిన స్థాయిలో వరద నీరు రావడం లేదు. అందుకే కాలువల్లో నీరు ప్రవహించడం లేదు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు, లైనింగ్ , పిల్లకాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో రూ.15 కోట్లు విడుదలైతే పనులు పూర్తవుతాయి.

- భవానీ శంకర్, డీఈ, వంశధార ప్రాజెక్టు

సొంత వైద్యం చేస్తే చర్యలు

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో హెచ్చరిక

బెలగాం, సెప్టెంబరు 21: జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు, ఆర్ఎంపీలు రోగులకు సొంతంగా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. వైద్యుని సలహాతోనే మెడికల్ షాపుల్లో రోగులకు మందులు ఇవ్వాలని పేర్కొన్నారు. వైద్యుని సలహా లేకుండా ఏ విధమైనా మందులు విక్రయించరాదన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇంజెక్షన్‌లు చేయడం, సెలైన్‌లు ఎక్కించడం, ఆపరేషన్ చేయడం వంటివి చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ఇటువంటి సంఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్

బెలగాం, సెప్టెంబరు 21: జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సదరం కోసం వచ్చేవారికి అవసరమైతే భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. సదరం పరికరాలు అందుబాటులో ఉండాలని, స్థానికంగానే ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని తెలిపారు. ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఎల్లప్పుడూ పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వైద్యులతో వారానికి ఒకసారి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని చెప్పారు. పెద్ద సమస్య అయితే తప్ప వేరే ఆసుపత్రికి రిఫర్ చేయకూడదని , వైద్యులు ఎఫ్ఆర్ ఎస్‌లో తప్పనిసరిగా హాజరు వేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ.. ఆసుపత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉండాలన్నారు. డ్రైనేజీ, శానిటైజేషన్‌లో ఎటువంటి లోపాలు ఉండకూడదని తెలిపారు. గర్భిణుల కోసం హాట్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మహాప్రస్థానం వాహనం వారం రోజుల్లో వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, వైద్యులు, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పర్యాటక దినోత్సవంపై సమీక్ష

పార్వతీపురం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమీక్షించారు. వేడుకలు పర్యావరణ హితంగా ఉండాలన్నారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడాలని, సవర కళాఖండాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలన్నారు. ఆడలి వ్యూపాయింట్ ఆ రోజు ప్రారంభమవుతుందని తెలిపారు. వాహనాలు రాకపోకలు, వాటి పార్కింగ్ పక్కాగా ఉండాలని, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మధాహ్నం నుంచి సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ప్రపంచ పర్యాటక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ఇన్‌చార్జి పీవోలు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో సస్పెన్షన్

- ఆదేశాలు జారీ చేసిన పాఠశాల ఆర్‌జేడీ

గరుగుబిల్లి, సెప్టెంబరు 21 : గరుగుబిల్లి ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగభూషణరావును శనివారం సస్పెండ్ చేస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. జియ్యమ్మవలస ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో అధికారులు తొలుత జియ్యమ్మవలస మండలంలో విచారణ చేపట్టినా.. అది సక్రమంగా జరగలేదని జిల్లా యూటీఎఫ్ నాయకులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. ప్రతీ పనికి ఉపాధ్యాయుల నుంచి కొంతమేర వసూళ్లు, ఎస్ఎంఎఫ్ గ్రాంటు, నాడు-నేడు పనులకు సంబంధించి వసూళ్లు, మెడికల్ బిల్లులు, ఏఏఎస్ కోసం అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో గతనెల 2న పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి గరుగుబిల్లి ఎమ్మార్సీ భవనంలో విచారణ నిర్వహించారు. నివేదికలను విశాఖలోకి ఆర్‌జేడీ కార్యాలయానికి అందించారు. పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం తాజాగా ఎంఈవోను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలకు ఎంఈవో-1ను నియమించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మకు సూచించారు.

పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి)/కురుపాం: పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జేసీ శోభిక అదనపు బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. కాగా ఇన్‌చార్జి పీవో శ్రీవాస్తవ తొలుత కురుపాం ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. వంటగదులు, విద్యార్థుల డార్మెటరీలు, తరగతి గదులు పరిశీలించారు. విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలని , వారికి ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తెలుగు నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన అర్జీలను పరిశీలించి... వాటిని పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

జీవో 85 రద్దు చేయాల్సిందే..

- పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్

పార్వతీపురం, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తక్షణమే జీవో-85ను రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు పీజీ కోర్సులు చదివేందుకు అవసరమైన రిజర్వేషన్లు కల్పించాలని నినదించారు. తమకు అన్యాయం చేసే విధంగా ఉన్న జీవో రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినోద్ తెలిపారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- జిల్లాకేంద్రంలో అన్న క్యాంటీన్ పునఃప్రారంభం

బెలగాం, సెప్టెంబరు 21: పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలో అన్న క్యాంటీన్‌ను వారు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రూ.5కే పేదలకు కడుపు నిండా భోజనం పెట్టాలనే ఆలోచనతో సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వాటిని ఎత్తివేసి పేదల పొట్ట కొట్టిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ అన్న క్యాంటీన్లను ప్రారంభించడంతో పేదల ముఖంలో ఆనందం కనిపిస్తోందని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే పేదలు, గిరిజనులు, కార్మికులకు అన్న క్యాంటీన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్‌కి వచ్చిన వారికి కలెక్టర్, ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. తర్వాత వారు కూడా అక్కడే భోజనం చేశారు. తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందించిన ప్రభుత్వాన్ని మహిళలు, వృద్ధులు దీవించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, టీడీపీ నేతలు వెంకట నాయుడు, సీతారాం, గౌరినాయుడు, నారాయణరావు, చంద్రమౌళి, రవి, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఆనందంగా ఉంది..



ఈ రోజుల్లో రూ.5కి కనీసం ఇడ్లీ కూడా రావడం లేదు. కానీ కడుపు నిండా టిఫిన్, భోజనం పెడుతున్న సీఎం చంద్రబాబు కలకాలం ప్రజల గుండెల్లో ఉంటారు. హోటల్‌లో ఒకరు భోజనం చేస్తే రూ.వంద అవుతుంది. అటువంటిది రూ.5కే పప్పు, కూర, ఆవకాయ, అన్నం, హల్వా, పెరుగుతో భోజనం పెట్టారు. ఎంతో ఆనందంగా ఉంది.

- భారతమ్మ, వెంకట లక్ష్మి, రవి, పార్వతీపురం

భోజనం బాగుంది..



పనిమీద పార్వతీపురం వచ్చాను. అన్న క్యాంటీన్‌లో రూ.5లకే భోజనం చేయడం చాలా సంతోషంగా ఉంది. భోజనం చాలా బాగుంది. సామాన్యులు, పేదల ఆకలి తీరుతుంది.

- గంగరాజు, వెంకంపేట

పెదతాడివాడలో పైడిమాంబ సిరిమాను చెట్టు



డెంకాడ, సెప్టెంబరు 21: పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును గుర్తించారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని పెదతాడివాడ గ్రామంలో మజ్జి అప్పారావు కల్లంలో ఉన్న చింతచెట్టును సిరిమానుగా మలచనున్నారు. అమ్మవారు తనకు కలలో కనిపించి ఆ చెట్టును సిరి'మాను'గా ఉప యోగించాలని చెప్పినట్లు పూజారి బంటుపల్లి వెంకటరావు శనివారం తెలిపారు. అమ్మవారి ఆజ్ఞతో గ్రామానికి వెళ్లి వెతికామని, కలలో చెప్పిన ఆనవాళ్లన్నీ ఆ చింతచెట్టులో చూసి నిర్ధారించామని చెప్పారు. సిరామను, ఇరుసుమాను వృక్షాలకు ఆదివారం ఉదయం 9 గంటలకు బొట్టు పెట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సిరిమాను చెట్టు గుర్తింపు ప్రక్రియతో అమ్మవారి పండగలో మరో కీలక ఘట్టం పూర్తయింది. చెట్టుకు వైభవంగా పూజలు చేశాక మూహశార్తం నిర్ణయించి పూజారి ఇంటికి తరలించే తంతు చేపడ్తారు.

ఏపీలో దేవర టికెట్ ధరలు పెంపు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర' టిక్కెట్ల ధరలు పెంపు, స్పెషల్ షో లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 27న విడుదల అవుతోన్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షో లు.. అక్టోబరు 9వరకూ ఐదు షో ల చొప్పున రాష్ట్రంలో రిలీజైన అన్ని థియేటర్లలో ఆడించుకోవచ్చు. టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి నిర్మాతల వినతిని పరిశీలించిన ప్రభుత్వం 60రూపాయల నుంచి 135రూపాయల వరకూ పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. మొదటి రోజు అర్ధరాత్రి 12గంటలకు బెనిఫిట్ షో, ఉదయం ఆరింటికే మార్నింగ్ షో నుంచే సినిమా ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాతలకు అనుమతి ఇచ్చింది. విడుదలైన రెండో రోజు(28) నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఐదు షో లు ప్రదర్శించుకోవచ్చు. అక్టోబరు 6తర్వాత సాదారణ ప్రదర్శనలు ఉంటాయి.

వేధించడం మా విధానం కాదు : పవన్ కల్యాణ్



'రాజకీయాలకు అతీతంగా చిత్ర పరిశ్రమకు మేలు చేయాలనేదే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం. వైకాపా ప్రభుత్వం తరహాలో నిర్మాతలను, సినీ నటులను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్, నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్ ట్వీట్ చేసింది. దీనిపై పవన్‌కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. వైసీపీ పాలనలో సినీ ప్రముఖులు ఎన్ని కష్టాలు పడ్డారో నాకు తెలుసు. వ్యక్తులు, రాజకీయాలతో మాకు సంబంధం లేదు, పరిశ్రమను మేం గౌరవిస్తాం. మీ సినిమాకు మంచి జరగాలి' అని 'దేవర' యూనిట్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



వెంకీ షూటింగ్‌లో బాలయ్య

అగ్ర హీరోల షూటింగ్స్ ఒకేచోట జరుగుతున్నప్పుడు ఒక హీరో సెట్‌కు మరో హీరో వెళ్లడం, సరదాగా కాసేపు గడపడం, సినిమాల గురించి మాట్లాడుకోవడం గతంలో ఓ అలవాటుగా, సంప్రదాయంగా ఉండేది. హీరోల మధ్య ఐకమత్యానికీ, స్నేహబంధానికీ అటువంటి సంఘటనలు అద్దం పట్టేవి. చాలా రోజుల తర్వాత నందమూరి బాలకృష్ణ మళ్లీ ఆ సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలకృష్ణ ఈ విషయం తెలుసుకుని వెంకటేశ్ షూటింగ్ స్పాట్‌కు వెళ్లి సందడి చేశారు. బాలయ్య, వెంకీ మంచి స్నేహితులు. అలాగే అనిల్ రావిపూడి బాలయ్యతో 'భగవంత్ కేసరి' చిత్రం రూపొందించారు. బాలయ్య రాకతో టీమ్ చాలా థ్రిల్ అయింది.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ తనయుడు, ఛాయాగ్రాహకుడు నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప శనివారం కలసి రూ. 25 లక్షల విరాళం చెక్కు అందజేశారు.

మా మధ్య అలాంటి సంబంధం లేదు



తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు అంగీకరించారని, తన సంతోషమే వారికి ముఖ్యమని హీరో 'జయం' రవి స్పష్టం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'బ్రదర్' సినిమా ఆడియో విడుదల వేడుక శనివారం చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ఇంతకాలం ఇండస్ట్రీలో ఎలాంటి గాసిప్స్ లేకుండా జీవితాన్ని గడిపాను. ఇపుడు నాకు, పరాయి స్త్రీకి సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా తప్పు. గాయని కెనీషాకు నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎంతోమందికి ఆమె ప్రాణం పోశారు. ఆర్తికి తెలియకుండా విడాకుల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన చేశారు. విడాకుల విషయంపై రెండు సార్లు నోటీసులు పంపించాను. ఇదే విషయంపై ఆర్తి తండ్రి వచ్చి నా తల్లిదండ్రులతో చర్చించారు. ఇంత జరిగినా తనకు తెలియకుండా తీసుకున్నట్టు చెప్పడం షాకింగ్‌కు గురిచేసింది. విడాకుల గురించి నా పెద్ద కుమారుడికి కూడా వివరించాను. అందరు పిల్లల్లాగే అతను కూడా మేమిద్దరం కలిసి వుండాలని కోరాడు. నా ఇద్దరు కుమారులు నా వద్దనే ఉంటున్నారు. ఇపుడు నేను కోరేది ఒక్కటే.. ప్రైవేట్ లైఫ్ ప్రైవేట్ లైఫ్‌గానే ఉండనివ్వండి. గాయని కెనీషా 600కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మేమిద్దరం ఒక హీలింగ్ సెంటర్‌ను నెలకొల్పి అనేక మందికి సాయం చేయాలని ప్లాన్ చేస్తున్నాం. దాన్ని పాడు చేయవద్దు. అనవసరంగా నా గురించి, కెనీషా గురించి చెడుగా మాట్లాడవద్దు' అని కోరారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

రజనీ.. ఓ సుప్రీమ్ స్టార్



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ 33 ఏళ్ల తర్వాత కలసి నటించిన సినిమా 'వేట్టయాన్'. తాజాగా ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ గురించి రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌కు కూడా జీతం ఇవ్వలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాక తనకు ఎంతో ఇష్టమైన జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. అప్పుడు బాలీవుడ్ మొత్తం ఆయన్ను చూసి నవ్వింది. కానీ ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి కోలుకుని.. మరో మూడేళ్లలో.. వరుస సినిమాలు..'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోతో మళ్లీ నిలదొక్కుకున్నారు. జూహూలోని తన ఇంటితో పాటు మరో మూడు ఇళ్లను అమితాబ్ తిరిగి కొనుగోలు చేశారు" అని రజనీ చెప్పారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినా.. అమితాబ్ ఓ వీడియో పంపి అభిమానులను ఖుషీ చేశారు. ఆ వీడియోలో అమితాబ్ మాట్లాడుతూ "ఇది నా తొలి తమిళ చిత్రం. రజనీకాంత్.. అందరిలో ఓ సుప్రీమ్ స్టార్. 1991లో రజనీ, నేను కలసి నటించిన చిత్రం 'హమ్'. ఇందులో రజనీ నా సోదరుడిగా నటించారు. షూటింగ్ విరామంలో నేను ఏ.సీ కార్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో.. రజనీ ఫిల్మ్ సెట్స్‌లో కింద పడుకునేవారు. ఈ చిన్న ఉదాహరణ చాలు ఆయన ఎంత సింపుల్‌గా ఉంటారో చెప్పడానికి" అని అన్నారు.

అమితాబ్ కోసం ప్రకాశ్‌రాజ్...

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ పాత్ర తమిళ్ వెర్షన్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. సినిమాలో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. అమితాబ్, రజనీకి సీనియర్‌గా సత్యదేవ్ అనే పాత్రలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలవుతోంది.

రవికుమార్ చౌదరి ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి?



'యజ్ఞం', 'పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలు అందించి, ఇటీవల రాజ్‌తరుణ్ నటించిన 'తిరగబడరా సామీ' తో మరో విజయం అందుకొన్న దర్శకుడు రవికుమార్ చౌదరి తన కొత్త చిత్రం వివరాలు వెల్లడించారు. 'ఫ్లాష్‌బ్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా ఉంటుందని, న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా రూపొందుతుందని ఆయన తెలిపారు. 'లేనిది ఎవరికి?' అనేది ట్యాగ్ లైన్. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు రచన: డైమండ్ రత్నబాబు, పాటలు: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, సంగీతం: జేబీ, ఛాయాగ్రహణం: ప్రభాకరరెడ్డి, సమర్పణ: రిగ్వేద చౌదరి. నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత కార్తీక్ రెడ్డి రాకాసి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ డ్రామా



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, గౌరి ప్రియ జంటగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఉద్భవ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే మొదలెట్టనున్నాం. అందరినీ కడుపుబ్బా నవ్వించే ఈ చిత్రంలో గుండెలకు హత్తుకునే డ్రామా కూడా ఉంటుంది" అని చెప్పారు.


దత్తిరాజేరు: మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి


విజయనగరంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదితి


రాజాం రూరల్: కొండంపేటలో మాట్లాడుతున్న కోండ్రు

సంక్షోభంలో సంక్షేమం.. టీడీపీకే సాధ్యం

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యేలు ● జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటి పర్యటన చేసిన కార్యకర్తలు

దత్తిరాజేరు: రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు ఇవ్వడం ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దత్తి గ్రామంలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ● గుచ్చిమి గ్రామ సర్పంచ్ కడుబండి సూర్యనారాయణతో పాటు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ● **విజయనగరం రూరల్:** ఎన్‌డీఏ కూటమి ఏర్పాటైన 100 రోజుల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు.. శనివారం 'మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నగరంలోని నాలుగో డివిజన్‌లో ఆమె పర్యటించారు. ● **బాడంగి:** మండలంలోని ఆకులకట్ట గ్రామంలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** తెలుగుదేశం, ప్రజా ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలు గుర్తించి ఆదరిస్తున్నారని మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **జామి:** వచ్చే దీపావళి నుంచి రాష్ట్ర ప్రభుత్వం తెల్లకార్డు వున్న ప్రతి ఒక్కరిని మూడు సిలిండర్లు ఇవ్వనుందని కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రారంభించనుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం మండలంలోని పావాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా గ్రామస్థులను కలిసి వారి ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛతహీలో భాగంగా మొక్కలు నాటారు. ● **నెల్లిమర్ల:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సంక్షేమ పాలన అందించి ప్రజలతో ప్రశంసలు అందుకుంటోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. నగర పంచాయితీలోని 11వ వార్డులో ఆమె శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ● **గుర్ల:** తెలుగుదేశం పార్టీ నాయకులు కష్టపడి పనిచేస్తారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. తాటిపూడి గ్రామంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.


జామి: కలగాడలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే లలితకుమారి


నెల్లిమర్ల: ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి


గుర్ల: తాటిపూడిలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు


బాడంగి: ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌ను అంటిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు

మమ్మల్ని వెలివేశారు

● ఎన్నికల్లో పోటీ చేయడమే మా పాపమా?

● నారాయణపురంలో ఓ కుటుంబం ఆవేదన


సీర దేముడు కుటుంబం

జామి: 'మమ్మల్ని మా కులం నుంచి వెలివేశారు. శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు పిలవడం లేదు. రెండేళ్లుగా నరకం చూపిస్తున్నారు. అధికారులే న్యాయం చేయాలని' అలమండ పంచాయతీ నారాయణపురానికి చెందిన సీర దేముడు కుటుంబం వేడుకుంటుంది. శనివారం గ్రామంలో దేముడు కుటుంబం విలేకర్లతో మాట్లాడింది. 'గత పంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్ కోసం వైసీపీ రెబల్ అభ్యర్థిగా మా కుటుంబం నుంచి ఒకరు పోటీ చేసి ఓడిపోయాం. అప్పటి నుంచి గెలిచిన వ్యక్తి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. మా కులం వారికే డబ్బు, మందు ఎరవేసి మమ్మల్ని కులం నుంచి వెలివేసేలా చేశారు. రెండేళ్లుగా ఎలాంటి కార్యక్రమాలకు పిలవడం లేదు. ఇల్లు కట్టుకుంటుంటే అడ్డుకుంటున్నారు. పని చేసేందుకు వచ్చిన కూలీలపై దాడి చేయడంతో వారు పారిపోయారు. ఈ విషయంపై అప్పటి కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కొంతమంది అధికారులు ఆ నాయకుడికి కొమ్ముకాస్తున్నారు. ఉప సర్పంచ్ లగుడు దేముడు కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఎన్నికల్లో పోటీ చేయడమే మేము చేసిన పాపమా?. అధికారులే న్యాయం చేయాలని' కోరారు. ఈ విషయమై ఉప సర్పంచ్ లగుడు దేముడు స్పందిస్తూ.. 'నాకు ఎవరితోనూ వైరం లేదు. ఎవ్వరినీ ఇబ్బందులు పెట్టలేదు. సదరు బాధిత కుటుంబానికి వారి కులం సభ్యులతో తగాదాలు ఉన్నాయి. నాకు వాటితో సంబంధం లేదని' తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

సాలూరు రూరల్: మండలంలోని ఖరాసవలసలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ వివరాలను సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి విలేకరులకు శనివారం వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. ఖరాసవలస గ్రామానికి చెందిన ఇల్లాపుదొర ఖరాసమ్మ(39) 15 ఏళ్ల కిందట బి.శీను అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొంత కాలంగా శీను మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన భార్య అస్వస్థతకు గురయ్యిందంటూ సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఖరాసమ్మ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తండ్రి పైడన్నదొర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నదిలో పడి వృద్ధురాలి మృతి

● 12 రోజుల తరువాత మృతదేహం లభ్యం

మక్కువ: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన శంబంగి గౌరమ్మ (65) అనే వృద్ధురాలు నదిలో పడి మృతి చెందింది. ఆమె మృతదేహం 12 రోజుల తరువాత లభ్యమైంది. గౌరమ్మ ఈనెల 9న పొలం పనుల కోసం గోముఖి నది దాటి ఉన్న పంట పొలాలకు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. అప్పటి నుంచి ఆమెను వెతుకుతున్న సమయంలో శనివారం సాయంత్రం డి.శిర్లాం గ్రామ సమీపంలో సువర్ణముఖి నది ఒడ్డున రక్షిత మంచినీటి పథకం పంపుహౌస్ వద్ద మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలికి భర్త గౌరినాయుడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో అధ్యాపకుడు..


జగన్నాథం (ఫైల్)

కొత్తవలస: కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా అధ్యాపకుడిగా పని చేస్తున్న పులిబంటి జగన్నాథం(54) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని వియ్యంపేట గ్రామానికి చెందిన జగన్నాథం గతంలో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేశారు. కొద్ది రోజులు కిందటే కొత్తవలస కళాశాలకు బదిలీపై వచ్చారు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకుని కళాశాలకు విధులు నిర్వహించడానికి సన్నద్ధమవుతుండగా గుండెపోటుతో కుప్ప కూలిపోయినట్టు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణా రెడ్డి, సిబ్బంది గ్రామానికి వెళ్లి జగన్నాథం భౌతికఖాయానికి నివాళులు అర్పించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

గరివిడి: తన భర్త మహాదేవ్ రాంబాబు అదృశ్యమైనట్లు రేగటి గ్రామానికి చెందిన సుజాత గరివిడి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు గ్రామానికి చెందిన రాంబాబుతో తనకు రెండేళ్ల కిందట వివాహం జరిగిందన్నారు. ప్రసవం కోసం గత నెల 31న తనను రేగటి గ్రామంలో విడిచిపెట్టి ఆయన వెళ్లారని ఫిర్యాదులో పేర్కొంది. అప్పటి నుంచి తన భర్త ఆచూకీ లేదని తెలిపింది. గరివిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

డెంకాడ (భోగాపురం): భోగాపురం మండలం దిబ్బలపాలెంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పెంటిబోయిన రాము, సీతమ్మ దంపతులకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ఇంటిలోనే వారు కిరాణా వ్యాపారం చేస్తున్నారు. దీంతో కిరాణా సామాగ్రి, పప్పు దినుసులతో పాటు ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ కాలిపోయాయి. అలాగే బీరువాలో ఉన్న తులం బంగారం, 35 వేల నగదు బూడిదైందని దంపతులు వాపోతున్నారు. ప్రమాద స్థలిని గ్రామ రెవెన్యూ అధికారి పరిశీలించారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

బాడంగి: మీసేవ కేంద్రాల్లో అధిక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు నిరక్షరాసులు మీ సేవ కేంద్రాలకు వెళ్తే వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకు నిర్వాహకులు అధిక రుసుం వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాగే విద్యార్థుల సర్టిఫికెట్ల విషయంలో కొంతమంది మీసేవ నిర్వాహకులు తప్పులు నమోదుచేస్తున్నారని, దీనివల్ల వాటిని సరిచేసేందుకు తమ సిబ్బందికి కష్టమవుతుందని చెప్పారు. సోమవారం నుంచి మీసేవ కేంద్రాల వద్ద ధరల పట్టిక విధిగా ఏర్పాటు చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ కార్యక్రమాలు అభినందనీయం

విజయనగరం దాసన్నపేట: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం అయన్ను తన చాంబర్‌లో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు కలిశారు. భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్ కార్యక్రమానికి సంబంధించిన లోగోని మంత్రి ఆవిష్కరించారు. విద్యార్థి సంఘాలు ఇటువంటి కార్యక్రమాలతో అవగాహనకల్పించాలని సూచించారు.

కంటి సమస్యలను త్వరగా గుర్తించాలి

విజయనగరం క్రైం: ప్రతి ఒక్కరూ కంటి సమస్యలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీసుశాఖ, సంధ్య కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో పడి సకాలంలో వైద్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కంటి సమస్యలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందిస్తే సమస్య ఉండదన్నారు. ఈ సందర్భంగా 150 మంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, యూనివర్స్, వైద్యులు కోటేశ్వరరావు, అమృతకుమార్, అశోక్‌కుమార్, సీఐలు లీలారావు, బి.వెంకటరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న బదిలీల ప్రక్రియ

కలెక్టరేట్: ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది. అన్ని శాఖల్లో బదిలీలు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు అంతా సిద్ధం చేశారు. ప్రధానంగా వెలుగు, రెవెన్యూ, పంచాయితీరాజ్ శాఖల్లో ఎక్కువ సంఖ్యలో బదిలీలు జరగనున్నాయి. గ్రామ స్థాయిలో పని చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు అధిక సంఖ్యలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులు ఇచ్చిన సిఫారసుల ప్రకారం ఎవర్ని ఎక్కడకి మార్పు చేయాలి? అనేదానిపై ఆ శాఖలకు చెందిన అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. చివరి రోజున బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

516బి హైవే పనులకు సర్వే

కొత్తవలస: విశాఖపట్నం-అరకు 516బి హైవేకు సంబంధించి సర్వే పనులు మండలంలో శనివారం ప్రారంభమయ్యాయి. చింతలపాలెం రెవెన్యూ పరిధిలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, నేషనల్ హైవే డివిజన్ అధికారులు కలసి సర్వే నిర్వహించారు. పెందుర్తి నుంచి శృంగవరపుకోట మండలం బొడరా వరకు సుమారు 40 కిలోమీటర్లు పొడవున 140 అడుగులు వెడల్పుతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా నిధులు కూడా విడుదల చేసింది.

వీవోఏపై విచారణ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో డ్వాక్రా సంఘాల పొదుపు డబ్బును తమ సొంతానికి వాడుకున్న వీవోఏపై శనివారం విచారణ నిర్వహించారు. ముందుగా డ్వాక్రా సంఘాల సభ్యులతో ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడారు. వారి ఖాతాల వివరాలు, పాస్ బుక్‌లను పరిశీలించారు. ఈ విచారణ కార్యక్రమం రెండు, మూడు రోజులు ఉంటుందని ఆయన తెలిపారు.

25న చెకుముకి టాలెంట్ టెస్ట్

బొబ్బిలి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25న పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు పోల సత్యంనాయుడు, ఎస్‌వీ రమణమూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం విడుదల చేశారు. జేవీవీ ప్రతినిధులు కె.కృష్ణదాసు, ఎస్.శ్రీనివాసరావు, ఆనెం శ్రీనివాసరావు, శివకుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

రామభద్రపురం: మండలంలో ఉపాధిహామీ పథకం కింద 22 గ్రామ పంచాయతీల్లో 2174 పనులు చేపట్టడానికి 140.54 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఏపీవో గొలగాని త్రినాథరావు తెలిపారు. ఉపాధిహామీ పథకం కార్యాలయంలో శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు.

పాఠశాల పరిశీలన

రాజాం రూరల్: మండల పరిధిలోని రాజయ్యపేటలోని ప్రాథమిక పాఠశాలను ఎం.ఇ.ఒ. దుర్గారావు శనివారం పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండిందీ లేనిదీ సరిచూశారు. ప్రొఫైల్ తయారుచేసుకుని టేబుల్‌పై ఉంచాలని, యుడైస్ ప్రకారం ఉన్న రోల్ మేరకు ఎటెండెన్స్ ఉండేలా చూడాలన్నారు.

మంజూరైన గృహాలన్నీ 2025 మార్చికి పూర్తి చేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: జిల్లాలో మంజూరైన గృహలన్నిటిన్నీ పూర్తి చేయడానికి 'మన ఇళ్లు-మన గౌరవం' పేరుతో ప్రభుత్వం ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ నెల 28న అన్ని గ్రామ పంచా యతీలలో మున్సిపాల్టీలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిచాలని కలెక్టరు ఆదేశించారు. శనివారం కలెక్టరు చాంబర్ నుంచి ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజనీర్లు, ఈవోపిఆర్‌డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలోని 27వేల గృహాలు మంజూరు చేయడం జరిగిందని , అందులో కొన్ని ప్రారంభం అయినాయని , మరి కొన్ని ప్రారంభం కానివి ఉన్నాయని, ఇంకొన్ని వేర్వేరు దశలలో ఉన్నాయని వీటన్నిటి నిర్మాణాలు 2025 మార్చినాటికి పూర్తి చేయాలని తెలిపారు. ప్రధానంగా మున్సిపాల్టీలలో ఎక్కువ లే అవుట్లు ఉన్నాయని , కమీషనర్లు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో,మున్సిపాలిటీలో లబ్ధిదారులకు అవగాహన కల్గించాలని తెలిపారు.

బీసీ కులగణన తక్షణమే చేపట్టాలి


మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

దాసన్నపేట : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణనను తక్షణమే చేపట్టి బీసీలకు న్యాయం చెయ్యాలని బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేట్ హోటల్లో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోంరాంబాబు ఆధ్వర్యంలో కుల జన గణన, బీసీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలు అత్యధికంగా ఉన్నా రాజ్యాధికారంలో అట్టడుగున ఉన్నారన్నారు. బీసీలందరినీ ఐక్యపరిచేందుకు అక్టోబరు-9న విజయ వాడలో కాన్షీరాం వర్ధంతి సందర్భంగా బీసీల మహాసభను నిర్వహిస్తున్నామని, ఈ సభకు అన్ని జిల్లాల నుంచి బీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, సోములుతో పాటు పలువురు బీఎస్పీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అన్నిదానం గొప్పది


విజయనగరంలో అన్నదాన కార్యక్రమం

విజయనగరం టౌన్: అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న అని, ప్రతి ఒక్కరూ అన్నదానం చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అవనాపు విజయ్ అన్నారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా విజయనగరం పట్టణంలోని 23, 32, 19 డివిజన్ల పరిధిలోని వినాయక మండపాలను శనివారం ఆయన సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం అందించారు.

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని చీపురుపల్లి వీధిలో హిందూ ఉత్సవసమితి అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేల సంఖ్యలో భక్తులు వచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించడంతో పెద్దఎత్తున క్యూలైన్లు బారులు దీరాయి. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.

వరద బాధితులకు వితరణ

బొబ్బిలి రూరల్: విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు శనివారం బొబ్బిలి మండలం కలవరాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుల్ల హరికృష్ణ, పాటూరు కృష్ణమూర్తి, చప్ప అప్పలస్వామి, ఇద్దుబోను వెంకటేష్, వాకాడ సింహాచలం కలిసి రూ. 42,000, ఎం బూర్జవలస గ్రామ టీడీపీ నాయకులు జి.శ్రీనివాసరావు, జి.మహేశ్వరరావు, లక్ష్మణరావు, డి భాను, సత్యనారాయణ కలిసి రూ. 32,200, మల్లంపేట వాస్తవ్యులు కళ్యంపూడి అన్నంనాయుడు రూ. 25,000, పక్కి గ్రామ టీడీపీ పెద్దలు రూ. 28,500, పాతబొబ్బిలి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి రూ. 56,000, గోపాలరాయుడుపేట, వెంకటరాయుడుపేట, నారసింహునిపేట టీడీపీ పెద్దలు ప్రజలు కలిపి రూ. 50,000, కారాడ పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి రూ. 43,500, బాడంగి మండలం రేజేరు గ్రామ టీడీపీ పెద్దలు కలిసి రూ. 75,000, కోడూరు గ్రామ టీడీపీ పెద్దలు రూ. 63,050, రామభద్రపురం మండలం కొత్తరేగ సర్పంచ్ కిలపర్తి మురళి రూ. 50,000, విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి చేరేలా ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన)కు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

కొట్టాం యువత విరాళం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కొట్టాం గ్రామ యువత ఎందరికో ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో కులమతాలకు అతీతంగా తుపాను బాధితులకోసం రూ.40వేలు సేకరించారు. సేకరించిన నగదులు ముఖ్యమంత్రి సహాయనిధికి అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు శనివారం అందించారు. ఈయువతను జిల్లా కలెక్టర్ అభినందించారు. యువత గోరపల్లి ఈశ్వరరావు, వేచలపు మహేష్, తగరంపూడి సన్యాసిరావు, గుర్రపు శ్రీనివాసరావు వున్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వెంకటనాగసుందర్

బొబ్బిలి: వినియోగదారులు తమకు రక్షణగా ఉండే చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల ఫోరమ్ జడ్జి ఆర్.వెంకటనాగసుందర్ అన్నారు. స్థానిక రఘు జూనియర్ కళాశాలలో శనివారం వినియోగదారుల మండలి అధ్యక్షుడు లంక సత్యం ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనాగసుందర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ రశీదును అడిగి తీసుకోవాలన్నారు. నాణ్యతాలోపం, తూనికలో తేడా, నకిలీ వస్తువులు తదితర అంశాలకు సంబంధించి వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయిస్తే కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ మేనేజరు బీఎండీ శివప్రసాద్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు, అంబేడ్కర్ పోరాటసమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

సాలూరు రూరల్: సాలూరు పట్టణానికి చెందిన వివాహిత పువ్వల సంతోషి కుమారి ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. సంతోషి కుమారి శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు చికిత్స నిమిత్త విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలికి భర్త సురేష్‌కు మార్, ఒక పాప ఉంది. మృతురాలి తల్లి గొర్లె సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్షలకు భయపడి విద్యార్థి ఆత్మహత్య

ఎండాడ: పరీక్షలు రాయడానికి భయపడి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొమ్మాదిలోని ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహంలో చోటుచేసుకుంది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురం గ్రామానికి చెందిన నిండిగుండి శంకర్రావు కుమారుడు జ్యోతి ప్రకాశ్ (16) కొమ్మాదిలోని ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు చెందిన వసతి గృహంలో ఎఫ్ బ్లాక్‌లో ఉంటున్నాడు. రూమ్‌లో అతనితో పాటు మరో ఏడుగురు ఉంటున్నారు. శనివారం ఆరోగ్యం బాగాలేదని, క్లాస్‌కు వెళ్లకుండా రూమ్‌లోనే ఉండిపోయాడు. మధ్యాహ్నం అందరూ క్లాసులకు వెళ్లిన తరువాత రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల క్రితం ప్రకాశ్ ఇంటికి వెళ్లి వచ్చాడు. శుక్రవారం రాత్రి తల్లితో ఫోన్‌లో మాట్లాడుతూ వచ్చే సెమిస్టర్ పరీక్షలు కష్టంగా ఉన్నాయని చెప్పాడు. భయపడకుండా పరీక్షలకు హాజరుకావాలని తల్లి చెప్పింది. కానీ పరీక్షలకు భయపడి ఆత్మహత్య చేసుకున్నట్టు విద్యా ర్థులు, కళాశాల సిబ్బంది చెబుతున్నారు.

ఉపాధ్యాయుల చేయూత

శృంగవరపుకోట రూరల్: మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన దినసరి కూలీ గెదెల కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబానికి లక్కవరపుకోట మండలం గోల్డాం ప్రభుత్వ పాఠ శాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆర్థిక సాయం అందించారు. శనివారం పాఠశా ల హెచ్‌ఎం సుదర్శన్, సీనియర్ ఉపాధ్యాయుడు ఇందుకూరి అశోక్‌రాజు, ఉపాధ్యాయులు కలిసి రూ.13,600 సేకరించి మృతుడి భార్యకు అందించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: ఇసుకను ట్రాక్టర్ ద్వారా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం విలేఖర్లతో మాట్లాడుతూ గెడ్డలు, వాగుల వద్ద ఇసుక అక్రమంగా రవాణా చేయడం వల్ల కల్వర్టులకు ప్రమాదం ఏర్పడుతుందని, ప్రభుత్వం అనుమతించిన రీచ్‌ల ద్వారా ఇసుక సరఫరా చేయాలని సూచించారు. ఎస్ఐ వెలమల ప్రసాద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో గ్రామస్తులకు వల్లంపూడి ఎస్ఐ దేవి శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్తు మందులు, సైబర్ క్రైమ్, తదితర నేరాలుపై గ్రామస్థులకు వివరించారు.

లడ్డూ కల్తీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం: తిరుమల తిరుపతి దేవస్థానంలోని లడ్డూ ప్రసాదం కల్తీ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ బాదంపూడి నాగరామలింగేశ్వరశర్మ (నాగబాబు) డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ హిందూ భక్తుల మనోభావాలతో గత ప్రభుత్వం ఆటలాడుకుందని, శ్రీవారి ప్రసాదంలో నాసిరకం నెయ్యి కొనుగోలులో ప్రధాన పాత్ర వహించిన టీడీపీ చైర్మన్, ఈవోలపై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందు ధర్మపరిషత్ నాయకులు బల్లేపల్లి శ్రీకాంత్, వెలవలపల్లి శ్రీనివాస శర్మ, కాళ్లకూరి విజయదుర్గ శాస్త్రి, బ్రహ్మాజీ, అక్కేన నాగేశ్వరరావు పాల్గొన్నా రు. ● **బొబ్బిలి రూరల్:** తిరుమలపై వైసీపీ మొదటి నుంచి కుట్రలు చేస్తుందని, చివరికి లడ్డూ ప్రసాదాన్ని కూడా కల్తీ చేసే స్థాయికి దిగజారిందని హిందూ ఉత్సవ సమితి చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు ఆవే దన వ్యక్తం చేశారు. బొబ్బిలిలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాసస్త్యాన్ని దెబ్బతీయడా నికి అధికారంలో ఉన్న ఐదేళ్లు వైసీపీ పెద్దలు పనిచేస్తూనే ఉన్నారన్నారు. చివరకు స్వామివారి ప్రసాదాన్ని కూడా కల్తీ నెయ్యితో అపహాస్యం పాలు చేశారు. ● **లక్కవరపు కోట:** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో వైసీపీ నేతలు పడిన కక్కుర్తిలో ఎంతటివా రినైనా శిక్షించాలని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ సభ్యురా లు కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం ఎల్.కోటలో గల ఆమె నివాసం లో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి జగన్ రెడ్డిపై మండిపడ్డారు. కమిషన్లకు కక్కుర్తిపడి అతి పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో జంతు, చేపల నూనెలను వాడి అపవిత్రం చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మార్గదర్శకులు శ్రీనాదు పెదబాబు తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల కొండ అపవిత్రమైపోయిందని, శ్రీవారి లడ్డూ ప్రసాద నివేదనలో మహాపచారం జరిగిన కారణంగానే ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరపరాజయం పాలైందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక దర్బార్ మహల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించడం పట్ల భక్తకోటి ఎంతో నొచ్చుకుందని, చంద్రబాబునాయుడు ప్రభుత్వం కచ్చితంగా ప్రధాని నరేంద్రమోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహాయ సహకారాలతో భక్తుల ఆకాంక్ష మేరకు తిరుమల కొండ పవిత్రతను కాపాడుతారన్నారు. సనాతన ధర్మానికి అందరూ బద్ధులై ఉండాలన్నారు. ● **దాసన్నపేట:** కలియుగ దైవంగా భావించే తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూను అపవిత్రం చెయ్యటం దుర్మార్గమైన చర్య అని బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ రాకేష్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి లడ్డూని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని, అటువంటి పవిత్రమైన ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో కలిపిన నెయ్యిన వాడి, దుర్మార్గానికి పాల్పడ్డారని మండిపడ్డారు. గతంలో చైర్మన్‌గా వ్యవహరించిన వైవి సుబ్బారెడ్డి, సీఎం చంద్రబాబునాయుడును విమర్శించ టం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో భాగంగా కొవ్వు కలిసినట్లు నిర్ధారించిన ల్యాబ్ రిపోర్టును ప్రదర్శించారు. సంఘ నాయకులు రవికుమార్, వాసు, శ్రీనివాస్ , రవీంద్ర, ఆచారి పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సంధ్యారాణి
- రెండో రోజూ వాడవాడలా 'ఇది మంచి ప్రభుత్వం'
- అభివృద్ధిపై ప్రచారం


మక్కువ: కరపత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి


సీతంపేట రూరల్: ప్రభుత్వ ప్రగతిని వివరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



కురుపాం రూరల్: కిచ్చాడలో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మక్కువ: ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని రాష్ట్ర గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. సంక్షోభ సమయంలోనూ సంక్షేమం అందించడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాలూరు నియోజకవర్గ కార్యక్రమ ప్రత్యేక అధికారి ప్రసూనాంబ, టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, సాలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రిషివర్ధన్, ఎంపీడీవో సీహెచ్.సూర్యనారాయణ, సర్పంచ్ బొత్స మహాలక్ష్మి, సర్పంచ్ ప్రతినిధి బొత్స కన్నమనాయుడు, కూటమి నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

సీతంపేట రూరల్: కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని చింతాడ గ్రామంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసిన ప్రగతిని వివరించారు. అంతకుముందు సున్నంగూడ నుంచి చింతలగూడ గ్రామానికి నిర్మించతలపెట్టిన రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మొహమ్మద్ గియాజుద్దీన్, ఎంపీడీవో కె.గీతాంజలి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి, ఈవోపీఆర్డీ కె.సత్యం, ట్రాన్స్‌కో ఏఈ నీలిమ, సీడీపీవో రంగలక్ష్మి, కూటమి నాయకులు సవరతోట మొఖలింగం, పవన్, ప్రభుకుమార్ పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయం

కురుపాం రూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కిచ్చాడ గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులు అయిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు


ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్: వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలను ప్రైవేటు ఆసుపత్రులు కచ్చితంగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. శనివారం ఆయన డీపీఎంవో డా.రఘుకుమార్, వైద్య బృందంతో కలిసి పట్టణంలో శుభం డయాబెటిక్ అండ్ స్పెషాలిటీ కేర్, శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ డెంటల్ కేర్ ఆసుపత్రులను సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ తేదీలు, అర్హత ధ్రువపత్రాల రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రుల్లో ఉండాల్సిన వైద్య పరికరాలు, పరీక్షా కిట్లు నాణ్యత, పనితీరును తనిఖీ చేశారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో ఉపయోగించిన సూదులు, సెలైన్, కాటన్, తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిర్వహణ, రోగుల టాయిలెట్లు శుభ్రత నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. వైద్య పరీక్షల ఫీజు వివరాల లిస్టును ప్రదర్శించకపోవడంతో నిర్ణీత గడువులోగా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఆరోగ్య సూచనలు, సలహాలు తెలియజేసే పోస్టర్లు ఉండాలన్నారు. వీరితో పాటు డెమో యోగేశ్వరరావు, ఈవో సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మండల అభివృద్ధికి ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎంపీపీ బొంగు సురేష్ కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడిగా సాగింది. ముందుగా వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్‌కుమార్ ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించలేదని మండిపడ్డారు. తర్వాత జడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో వీవోఏలను అన్యాయంగా తొలగించడం తగదని, దీనిపై ఏపీఎం నాగభూషణరావు వివరణ ఇవ్వాలని కోరారు. ఎంపీపీ సురేష్ మాట్లాడుతూ వెలుగులో పనిచేస్తున్న మగ వీవోఏల స్థానంలో మహిళలను వేయాలని, ప్రస్తుత వీవోఏలుగా పనిచేస్తున్న మగవారికి నోటీసులు జారీ చేయాలని ఏపీఎంకు సూచించారు. అనంతరం వివిధ శాఖలపై పూర్తి సమీక్షా సమావేశం నిర్వహించారు. తరువాత ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి మూడు నెలలకొకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహణతో పాటు నెలలో మొదటి శనివారం, చివరి శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశమై అభివృద్ధిపై చర్చించుకుంటే మంచిదని ప్రతిపాదించగా సభ్యులందరూ అంగీకరించారు. అయితే ఈ సర్వసభ్య సమావేశంలో అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లందరూ హాజరుకావాడం విశేషం.

శ్రద్ధగా చదువుకోవాలి


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

బెలగాం: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని ఆయన బాలికలకు సూచించారు. ఆహార పదార్థాలను వృథా చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పగడాలమ్మ, ఏఎంవో శంకర్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ విద్యార్థినికి ఆర్థిక సాయం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న మండంగి సోనియా అనే బాలికకు ఐటీడీఏ నుంచి రూ.50వేలు ఆర్థిక సాయం అందింది. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టర్ కార్యాల యంలో ఇన్‌చార్జి పీవో, జేసీ శోభిక సమక్షం లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోనియాకు చెక్కును అందించారు. సోనియా కురుపాం మండలం చింతమానుగూడ గ్రామానికి చెందిన పీవీటీజీ (సవర) బాలిక. గత ఏడాది నీట్‌లో ర్యాంకు సాధించి రంగరాయ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించింది. మొదటి సంవత్సరంలో చేరడానికి ఆర్థిక పరిస్థితిని పార్వతీపురం ఐటీడీఏ పీవోకు తెలియజేయగా రూ.50 వేలు విడుదల చేశారు. రెండో సంవత్సరం ఫీజు, ఇతర అవసరాలకు రూ.50వేలు చెల్లించడానికి పార్వతీపురం ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయంగా చెక్కును అందించారు.

అప్రమత్తంగా ఉండాలి


పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. శాంతిభద్రల పరిరక్షణకు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డీఎస్పీ రాంబాబు ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని కూడా సందర్శించారు. శాంతిభద్రతల పరరక్షణతో పాటు ఫ్రెండ్లీ పోలిసింగ్ ఉండాలన్నారు. ఆయన వెంట ఎల్విన్‌పేట సీఐ హరి, ఎస్ఐ శివప్రసాద్ ఉన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొమరాడ: కురుపాంలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో కొమరాడ ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17లో 1500 మీటర్ల విభాగంలో సీహెచ్ రోహిత్, 800 మీటర్ల విభాగంలో కె.పవన్, అలాగే జావెలిన్‌త్రో 1500, 800 మీటర్ల విభాగంలో కె.అభిషేక్, లాంగ్ జంప్ విభాగంలో పి.ప్రభుకుమార్, ఖోఖో విభాగంలో పి.భరత్, వాలీబాల్ విభాగంలో ఎం.జిల్లు ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 వాలీబాల్ విభాగంలో జి.శ్రవంతి, ఖోఖో విభాగంలో బి.రోహిత్ ఎంపికయ్యారు. వీరంతా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు పి.హరి, టి.కమలహాసన్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు తెలిపారు.

రెండో రోజు కొనసాగిన క్రీడా పోటీలు

కురుపాం: కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జగదీశ్వరి హాజరు కాగా, క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు సత్కరించారు. క్రీడా పోటీల నియోజకవర్గ ఇన్‌చార్జి బి.మాధవరావు, జిల్లా వీడీఎస్‌సీ చంద్రమోహన్, ఎస్‌జీఎస్ సెక్రటరీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం


మంత్రితో శివపట్నాయక్, కొండబాబు

ఒడిశా

రాయగడ: జిల్లాలో పర్యటిస్తున్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేశ్‌రామ్‌సింగ్ శనివారం సెరిగుడలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివపట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని తెలిపారు. 2027లో జరగబోవు మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో మంత్రిని కలిసిన బీజేపీ నాయకుడు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు (కొండబాబు) రానున్న రోజుల్లో జిల్లాలో పార్టీ పటిష్టతకు మరింతగా కృషి చేస్తామని మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పద్మనాభదాస్ పాల్గొన్నారు.

మహాకవికి నివాళి

- ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

ఆధునిక సాహిత్యానికి అడుగుజాడ.. గురజాడ అని పలువురు కవులు వ్యాఖ్యానించారు. మహాకవి గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోని పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


పరిశినాయుడు గోటితో గీసిన గురజాడ చిత్రం


బెలగాం: మాట్లాడుతున్న కవులు, సాహితీవేత్తలు


గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయంలో..


పాలకొండ: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయమణి



బలిజిపేట: పెదపెంకిలో గ్రంథాలయం వద్ద..

మందుగుండు సామగ్రి పట్టివేత

సీతానగరం: పెదంకలాం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మందు సామగ్రిని శనివారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేకుండా అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ● **జియ్యమ్మవ లస:** పరజపాడు పంచాయతీ కేంద్రంలో మందుగుండు సామగ్రి స్థావరంపై చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐ హరిబాబు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మందుగుండు సామగ్రి తయారీ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో ఒకరు పరారయ్యారు. త్వరలో అతనిని పట్టుకుని అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. వారిపై చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. ఏఎస్ఐ కాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని తెట్టంగి గ్రామంలో శనివారం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ కళానిధి సిబ్బందితో తనిఖీ చేసి దీపావళి మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.16వేలు విలువైన సామగ్రిని పట్టుకున్నామ ని ఎస్ఐ తెలిపారు. వీరఘట్టం గ్రామానికి చెందిన నల్ల వైకుంఠరావు, తెట్టంగి గ్రామానికి చెందిన తూముల వైకుంఠరావులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

విద్యారంగ సమస్యలపై పోరాడుతాం


మాట్లాడుతున్న ధనుంజయ్‌నాయుడు


పాచిపెంట: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ టీచర్ల ఫెడరేషన్-1938 జిల్లా శాఖ అధ్యక్షు డు వి.ధనుంజయ నాయుడు అన్నారు. మండలంలోని పాంచాళి, గురువునాయుడుపేట, మాతుమూరు, పాచిపెంట, కొత్తవలస, కర్రివలస గ్రామాల్లోగల జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. ఆయా పాఠశాలలోగల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు జరగబోయే 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలు, 80వ వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు, విజయనగరం జిల్లా కార్యదర్శి కె.సత్యారావు, రామభద్రపురం మండల శాఖ కార్యవర్గ సభ్యులు జి.గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో నాణ్యమైన నూనె వాడండి


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

వీరఘట్టం: వీరఘట్టంలో శనివారం స్వచ్ఛత హీసేవా కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన నూనెలను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు కోరారు. అదే విధంగా హోటల్‌లో కూడా నాణ్యతలో రాజీపడకుండా చక్కని నూనెతో ఆహార పదార్థాలు వండాలని ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. అనంతరం ప్రజతో ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఎం శివనాయుడు, ఏపీవో సత్యనారాయణ, ఈవో రవి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత


పోలీసుల ఆధ్వర్యంలో గుంత పూడుస్తున్న దృశ్యం

పాలకొండ: స్థానిక మండపం వద్ద రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంత ఏర్పడింది. వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే గుంతలో శివ అనే యువకుడు బైకుపై బోల్తా పడి, తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో స్పందించి బ్రిక్ వ్యాపారి పొగిరి వెంకటరమణ తన సొంత నిధులతో శనివారం గుంతలను పూడ్చివేశారు. పోలీసుల ఆధ్వర్యంలో గుంతను పూడ్చివేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కురిసింది వాన


భామినిలో కురుస్తున్న వర్షం

భామిని: మండల కేంద్రంలో ఎట్టకేలకు భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం దిమ్మిడిజోల, లివిరి, పసుకుడి, మూలగూడ, బొడ్డగూడ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ● **సీతంపేట రూరల్:** సీతంపేట ఏజెన్సీలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పార్వతీపురం రూరల్: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా సమాఖ్య భవనంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణా సదస్సు శనివారం ముగిసింది. స్టార్ట్ యువర్ బిజినెస్‌పై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. జిల్లా పరిశమల శాఖ ఐపీవో రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పరిశ్రమలకు కల్పిస్తున్న రాయితీలు, బ్యాంకు రుణాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృది సంస్థ సిబ్బంది ఎం.కంచిబాబు, నాయుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా ప్రారంభం

భామిని: మండలంలోని నేరడి బ్యారేజ్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత ఇసుక సరఫరా శనివారం ప్రారంభించినట్టు తహసీల్దార్ శేఖరం తెలిపారు. ఇసుక అవసరమైన వారు సచివాలయంలో గానీ, ఏపీ శ్యాండ్ మేనేజ్‌మెంట్ యాప్‌లో గానీ నమోదు చేసుకోవచ్చునన్నారు. ఇసుక తవ్వకాలు, లోడింగ్ టన్నుకు రూ.270 చెల్లించి ఇసుక తీసుకొని వెళ్లవచ్చునని చెప్పారు. ఇసుక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికీ 2,400 టన్నుల ఇసుక నిల్వా ఉందన్నారు. శనివారం 25 టన్నుల ఇసుక సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రమేష్, ఆర్ఐ రాంబాబు, మైనింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో నిర్వహిస్తున్న కురుపాం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వారి తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఎమ్మెల్యేని కలిసిన డీఎస్పీ

వీరఘట్టం: పాలకొండ డీఎస్పీగా విధులు చేపట్టిన ఎం.రాంబాబు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎం.రాజపురంలోగల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలపై దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

డీఎస్పీని కలిసిన కూటమి నాయకులు

పాలకొండ: నూతనంగా డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాంబాబును టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆయన చాంబర్‌లో కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఆయనతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు ప్రముఖ వైద్యుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వివేక్ రూ.20 వేలు విరాళంగా ఇచ్చారు. వివేక్ తరపున ఆయన ప్రతినిధి జగన్నాథం శనివారం ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే విజయచంద్రకు అందించారు.

మహిళా ఎంపీటీసీపై దాడి సరికాదు

సాలూరు రూరల్: గిరిజన మహిళా ఎంపీటీసీ సభ్యురాలిపై దాడి చేయడం సరికాదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు అన్నారు. మరిపిల్లిలో ఎంపీటీసీ జన్ని సీతారాంను ఆయన శనివారం పరామర్శించారు. తగాదా జరిగిన వివరాలను ఆమెను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆయనతో మర్రి శ్రీనివాసరావు, వంతల సుందరరావు, జానకీరావు, గాసి, ఈశ్వరరావు ఉన్నారు.

రేపు గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు

కురుపాం: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా సచివాలయ గ్రీన్ అంబాసిడర్లకు సోమవారం కురుపాం సీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభరాణి తెలిపారు. ఆమె శనివారం మాట్లాడారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య నిపుణులు పాల్గొని గ్రీన్ అంబాసిడర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ శిబిరానికి కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోగల సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు హాజరు కావాలని కోరారు.

విధులకు ఆటంకం.. కేసు నమోదు

వీరఘట్టం: చలివేంద్రి గ్రామంలో శుక్రవారం ఇళ్ల నిర్మాణాలపై సర్వే చేస్తుండగా గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటనాయుడు తన విధులకు ఆటంకం కలిగించాని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.ఉమామహేశ్వరరావు శనివారం స్థానిక పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు.